RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్ : చెరుకు ఉపేందర్ | గురువారం | 22 -02 - 2024
సంపుటి: 1 | సంచిక : 276 | పేజీలు : 4 | వెల : 5/-

## ఉత్తమ నటుడిగా షారుఖ్ ఖాన్..



4లో

# బాబు గారి బాటలో రేవంత్

### విజన్ 2050.. ప్రకటనలు




హైదరాబాద్, ప్రభాత సూర్యుడు: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం, ప్రస్తుతం ఏపీ ప్రతిపక్షనేత నారా చంద్రబాబు నాయుడు బాటలోనే పయనిస్తున్నారు. చంద్రబాబు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విజన్ – 2020 పేరుతో అభివృద్ధి పనులు చేపట్టారు. తర్వాత ఏపీలో విజన్ – 2040 అని ప్రకటించారు. కానీ దానిని పెద్దగా ఎవరూ పట్టించుకోలేదు. అయితే రేవంత్‌రెడ్డి మాత్రం ఆంధ్రప్రదేశ్‌ను ఎంతమంది సీఎంలు పాలించినా.. అభివృద్ధి కేవలం చంద్రబాబు హయాంలోనే జరిగినట్లు భావిస్తున్నారు. హైదరాబాద్ డెవలప్‌మెంట్ ఆయన చలవే అని నమ్మేవారే ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వంలో ఉన్నారు. దీంతో సీఎం కూడా చంద్రబాబు స్ఫూర్తితో ఇప్పుడు విజన్ – 2050 పేరుతో డెవలప్‌మెంట్ ప్లాన్ ప్రకటించారు.తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి మెగా మాస్టర్ ప్లాన్ అమలు చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. విజన్ – 2050 దిశగా ముందుకు వెళ్తామని ప్రకటించారు. గత 30 ఏళ్లుగా రాజకీయాలు ఎలా ఉన్నా అప్పట్లో సీఎంలు చంద్రబాబు నాయుడు, వైఎస్.రాజశేఖరరెడ్డి, కేసీఆర్‌లు గత ప్రభుత్వాల నిర్ణయాలనే మరింత

మిగతా 2వ పేజీలో...

# 200 కోట్లు కూడా తెచ్చుకోలేని కిషన్ రెడ్డి

### కేంద్రమంత్రిపై కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఫైర్



హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి ఫైర్ అయ్యారు. ఇవాళ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కిషన్ రెడ్డి.. మాటలు అవమానించే విధంగా ఉన్నాయన్నారు. భువనగిరి ఖిల్లా మీద రోప్ వే వేసుకుందాం అని 200 కోట్లు అడిగానని.. కిషన్ రెడ్డి కనీసం స్పందించలేదని ఆయన మండిపడ్డారు. నాలుగు ఏండ్ల నుండి ఫైల్ దగ్గర పెట్టుకున్నాడని, సొంత రాష్ట్రానికి 200 కోట్లు తెచ్చుకోలేక పోయాడని కోమటిరెడ్డి ధ్వజమెత్తారు. కిషన్ రెడ్డి కాంగ్రెస్ మీద మాట్లాడటం సరికాదని, టచ్ చేసి చూడు మా ప్రభుత్వంని పడగొడతాం అన్నట్టు మాట్లాడుతున్నాడని ఆయన వ్యాఖ్యానించారు. కేబినెట్ మంత్రిగా 200 కోట్లు అవ్వలేని వాడివి.. ఏం మాట్లాడుతున్నావని, గడ్కరీ దగ్గర 3000 కోట్ల పనులు తెచ్చుకున్నానన్నారు. కానీ కిషన్‌రెడ్డి

మిగతా 2వ పేజీలో...





# గద్దెనెక్కిన సారలమ్మ..

- గద్దెపైకి చేరిన కన్నెపల్లి బిడ్డ సారలమ్మ
- పగిడిద్దరాజు, గోవిందరాజులు కూడా
- అంగరంగవైభవంగా జాతర ప్రారంభం
- గురువారం మహాఘట్టం ఆవిష్కృతం
- చిలకల గుట్టనుంచి సమ్మక్క ఆగమనం

మేడారం, ప్రభాతసూర్యుడు : తెలంగాణ కుంభమేళా, ఆసియా ఖండంలో అతిపెద్ద ఆదివాసీ గిరిజన జాతర బుధవారం ఘనంగా ప్రారంభమైంది. కోరిన కోరికలు తీర్చే వన దేవత కన్నెపల్లి చందమామ బుధవారం రాత్రి మేడారం గద్దెపై కొలువుదీరింది. తొలుత కన్నెపల్లి నుంచి మేడారంలో ఉన్న కన్నతల్లి సమ్మక్క చెంతకు సారలమ్మ చేరుకుంది. రాత్రి 11 గంటలకు గద్దెలపైకి వచ్చింది. సారలమ్మతో పాటే గంగారం మండలం పూనుగొండ నుంచి పగిడిద్దరాజు, ఏటూరునాగారం మండలం కొండాయి నుంచి గోవిందరాజు లు గద్దెలపైకి చేరారు. ముగ్గురి రాకతో మేడారం వన జాతర వైభవంగా మొదలైంది. కన్నెపల్లిలో సారలమ్మ ఆలయంలో పూజారులు పూజా క్రతువులు నిర్వహించి కన్నెపల్లి నుంచి మేడారానికి సారలమ్మ బుధవారం రాత్రి బయలు దేరింది. కన్నెపల్లిలో చేసిన వాయిద్యాలు, నృత్యాలతో కన్నెపల్లి ఆలయం

మిగతా 2వ పేజీలో...



## రిమాండ్‌కు జ్యోతి

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : లంచం తీసుకుంటూ సోమవారం నాడు ఏసీబీ అధికారులకు అడ్డంగా దొరికిపోయి, కళ్ల నిండా నీళ్లతో ట్రైబల్ వెల్‌ఫేర్ ఆఫీసర్ జ్యోతి కనిపించిన సీన్ ఇది.

3లో



# ఉద్రిక్తంగా మారిన ఢిల్లీ

న్యూఢిల్లీ, ప్రభాతసూర్యుడు : పంటలకు కనీస మద్దతు ధరపై చట్టం కోసం ఆందోళన చేస్తున్న రైతులు.. కేంద్ర ప్రభుత్వానికి డెడ్‌లైన్ విధించారు.ఉదయం 11 గంటల వరకు.. ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఛలో ఢిల్లీ కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. పంజాబ్– హర్యానా సరిహద్దు అయిన శంభు బోర్డర్ నుంచి ఢిల్లీ వైపు బయల్దేందుకు సిద్ధమయ్యారు రైతులు. ఢిల్లీ దిశగా ట్రాక్టర్లు, ట్రాలీలతోనే బయల్దేరాలని నిర్ణయించారు. ఈసారి పోలీసుల టియ్యర్ గ్యాసుల ప్రయోగం, పిల్లెట్స్, వాటర్ కెనాన్ల నుంచి తప్పించుకునేందుకు ఫుల్ ప్రిపేర్డ్‌గా వెళ్తున్నారు రైతులు. భాష్పవాయు గోళాల నుంచి రక్షణ కల్పించేందుకు ముఖాలకు అడ్వాన్స్ మాస్కులు, హెల్మెట్లతో పాటు.. ఇనుప షీల్డులతో ముందుకెళ్లేందుకు సన్నద్ధమయ్యారు. డ్రోన్లను కూల్చేందుకు పతంగులు సిద్ధం చేశారు. టియ్యర్ గ్యాస్

మిగతా 3వ పేజీలో...



# కొడంగల్‌లో సీఎం రేవంత్ పర్యటన

### పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు : కొడంగల్ నియోజకవర్గం కోస్గిలో స్విచ్ ఆన్ చేసి ఒకేసారి పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం శంఖుస్థాపన చేసారు. రూ.4,369.143 కోట్ల అభివృద్ధి పనులకు అయన శంకుస్థాపన చేసారు. రూ.2,945 కోట్లతో నారాయణపేట్ – కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం, రూ.6.8 కోట్ల అంచనా వ్యయంతో కొడంగల్‌లో ఆర్ అండ్‌బి అతిధి గృహ నిర్మాణం, రూ.344.5 కోట్ల అంచనా వ్యయంతో కొడంగల్ నియోజకవర్గ వ్యాప్తంగా సింగిల్ లేన్ నుండి డబుల్ లేన్ రోడ్లు,వాటి విస్తరణ, పలు బ్రిడ్జిల నిర్మాణాలకు శంకుస్థాపన,

మిగతా 3వ పేజీలో...



# ఫస్ట్ నుంచి ఫ్రీ కరెంట్!

### మార్చి 1 నుంచి అమలుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

నల్లగొండ, ప్రభాతసూర్యుడు : కర్ణాటకలో తిరుగులేని మెజార్టీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తెలంగాణలో అధికారం కైవసం చేసుకోవాలని ఇతర పార్టీలకు భిన్నంగా ఆరుగ్యారంటీలను పథకాలను ప్రధాన మేనిఫెస్టోగా తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఈ ఆరు గ్యారెంటీలకు ఓటర్ల నుంచి మంచి స్పందన రావడంతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. అయితే ఆరు గ్యారంటీల్లో ఫ్రీ కరెంట్ అనేది కీలకమైన హామీ. ఇప్పటికే రెండు గ్యారంటీలను అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత కరెంట్ పై ఓ నిర్ణయానికి వచ్చింది.గృహజ్యోతి ఉచిత విద్యుత్ పథకానికి అవసరమైన పత్రాలను కోరుతూ తెలంగాణ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయడంతో మార్చి 1 నుంచి ఈ పథకం అమల్లోకి రానుంది. ఈ పథకం అమలుకు మార్గదర్శకాలు జారీ చేశామన్నారు. మార్చి 1వ తేదీ నుంచి అమలు చేసేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఈ పథకం ద్వారా

మిగతా 2వ పేజీలో...

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# యాచారం సీఐకి 'వరికుప్పల' సన్మానం




**యాచారం - ప్రభాత సూర్యుడు :** యాచారం మండల నూతన సిఐగా బాధ్యతలు చేపట్టిన శంకర్ కుమార్‌ని కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి వరికుప్పల సుధాకర్ ఆధ్వర్యం లో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ దేరంగుల పాండు ,ప్రధానకార్యదర్శి వరికుప్పల. అజయ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలసి శాలువాతో సన్మానించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ సందర్భంగా వరికుప్పల సుధాకర్ మాట్లాడుతూ యాచారం మండలం లో శాంతి భద్రతలకు విఘాతము కలుగకుండా బాగా చూడాలని, డ్రగ్స్ గంజాయి లాంటి మరకద్రవ్యాలకు యువత దూరంగా ఉండేలా చర్యలు చేపట్టాలని కోరారు.

# తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

## సీఐఐ సమావేశంలో సీఎం రేవంత్ స్పష్టం




**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** ఆర్థిక ప్రగతికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని.. ప్రపంచ దేశాలతో తెలంగాణ పోటీ పడాలనేదే తమ విధానమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ లో 'సీఐఐ తెలంగాణ' ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెట్టుబడిదారులకు, పారిశ్రామిక వేత్తలకు అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పెట్టుబడులకు రక్షణ కల్పించడమే కాకుండా.. లాభదాయకంగా ఉండేలా నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. రాజకీయాలు ఎలా ఉన్నా.. వైఎస్, చంద్రబాబు, కేసీఆర్ హైదరాబాద్ అభివృద్ధిని కొనసాగించారని.. అభివృద్ధి విషయంలో తమ ప్రభుత్వానికి ఎలాంటి భేషజాలు లేవని అన్నారు. నగర అభివృద్ధి కోసం గత పాలకులు తీసుకున్న మంచి నిర్ణయాలను కొనసాగిస్తామని.. రాష్ట్రంలో విద్య, ఉపాధి అవకాశాల కల్పనలో సీఐఐతో కలిసి ముందుకు నడుస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా 'విద్య, నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపక అవకాశాలు' అనే అంశంపై సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగించారు. గత పాలకుల నిర్ణయాల వల్లే హైదరాబాద్ ఐటీ హబ్ గా మారిందని అన్నారు. ఇందిరాగాంధీ విధానపరమైన నిర్ణయం తీసుకుని ఐడీపీఎల్ ను ప్రారంభించినందునే ఫార్మా రంగంలో హైదరాబాద్ మెరుగైన స్థితిలో ఉందని గుర్తు చేశారు. పాలకుల నిర్ణయాలు, విధానాలు రాష్ట్ర ఆర్థిక పురోగతికి తోడ్పడుతాయని చెప్పారు. అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) గురించి గతంలో మాట్లాడితే అవన్నీ అవసరమా అన్నారని.. ఇప్పుడు అదే తెలంగాణకు లైఫ్ లైన్ గా మారిందని అన్నారు. ఐటీఐల్లో స్కిల్ డెవలప్ మెంట్ కోసం టాటా సంస్థతో ఒప్పందం చేసుకున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో 64 ఐటీఐలను స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్లుగా రూ. 2 వేల కోట్లతో డెవలప్ చేస్తామని సీఎం రేవంత్ చెప్పారు. స్కిల్లింగ్ యూనివర్సిటీల ఏర్పాటు కోసం సంప్రదింపులు జరుపుతున్నామని అన్నారు. స్కిల్ డెవలప్ మెంట్ లో జాయిన్ అయిన విద్యార్థులకు డిగ్రీ సర్టిఫికెట్స్ ఇవ్వబోతున్నట్లు వెల్లడించారు. మరోవైపు, సీఎం రేవంత్ బుధవారం కొడంగల్ లో పర్యటించనున్నారు. సీఎం హోదాలో ఆయన తొలిసారి కొడంగల్ నియోజకవర్గానికి వెళ్లనున్నారు. ఈ సందర్భంగా నారాయణ పేట్ – కొడంగల్ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేయనున్నారు. అలాగే, కొడంగల్ లో వైద్య, నర్సింగ్, ఫిజియోథెరపీ కళాశాలల పనులకు శ్రీకారం చుట్టనున్నారు. నియోజకవర్గంలో మొత్తం రూ. 4,369 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేయనున్నారు.

# సమస్యలు తలెత్తకుండా శ్రద్ధ వహించాలి



## అధికారులకు ఎంపీపీ భాగ్యలక్ష్మి రెడ్డి సూచన

**చిన్న శంకరంపేట - ప్రభాత సూర్యుడు:** గ్రామాల్లో సర్పంచ్ ల మరియు వార్డు మెంబర్ల పదవి కాలం ముగియడంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చూసుకోవాలని చిన్న శంకరంపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఎంపీపీ ఆవుల భాగ్యలక్ష్మి గోపాల్ రెడ్డి అన్నారు. సర్పంచుల పదవీకాలం ముగియడంతో నియమించిన ప్రత్యేక అధికారులు , పంచాయతీ కార్యదర్శులు రోజువారి కార్యకలాపాలు అయినటువంటి శానిటేషన్ పనులు, తాగునీరు, వీధి దీపాలు నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలని ప్రత్యేక అధికారులు గ్రామాలను సందర్శిస్తూ పంచాయతీ కార్యదర్శుల సమన్వయంతో సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని ఏ ఇబ్బంది ఉన్న పై అధికారులకు తెలియజేసి సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దామోదర్, ఎమ్మార్వో మన్నన్ ,ఎంపీఓ గిరిధర్ రెడ్డి , వివిధ గ్రామాల ప్రత్యేక అధికారులు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# బాబు గారి బాటలో రేవంత్



మొదటిపేజీ తరువాయి..
పటిష్టంగా అమలు చేశారని చెప్పారు. అందుకే ఔటర్ రింగురోడ్డు, అంతర్జాతీయ విమానాశ్రయం, హైటెక్‌సిటీ వంటివి అందుబాటులోకి వచ్చాయన్నారు. హైదరాబాద్‌ను మరింత అభివృద్ధి చేయాలని రేవంత్ ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే మెట్రోపాలిటన్ సిటీగా గుర్తింపు పొందినందున అంతకు మించిన అభివృద్ధికి అందరి సలహాలు, సూచనలు తీసుకోవాలని రేవంత్ నిర్ణయించారు.
తర్వాత ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని భావిస్తున్నారు. తొందరపాటు చర్యలతో నష్టం జరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరంలోని ఓఆర్ఆర్, రీజినల్ రింగురోడ్డు మధ్య ప్రాంతాలను ఎంపిక చేసి అర్బన్, సెమీ అర్బన్, రూరల్ ప్రాంతాలుగా విభజించాలని ప్రభుత్వం భావిస్తోంది. చైనా తరహాలో 10 నుంచి 15 శాటిలైట్ టౌన్‌షిప్‌ల ఏర్పాటుకు ప్రణాళిక రూపొందిస్తోంది. ఫార్మాసిటీకి కేటాయించిన స్థలంలో కొత్త నగరం ఏర్పాటు చేయాలని భావిస్తోంది. ఒకేచోట ఫార్మసిటీ అని కాకుండా కాలుష్య రహితంగా ఫార్మా విలేజ్‌లను వేర్వేరు ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని భావిస్తోంది. ఇక మెట్రో విస్తరణకు కూడా ప్రణాళిక రూపొందిస్తోంది. ఎయిర్‌పోర్టు, మియాపూర్ నుంచి ఆర్సీ పురం వరకు, రాయదుర్గం నుంచి గచ్చిబౌలి మీదుగా అమెరికన్ కాన్సులేట్ వరకు పొడిగించాలని భావిస్తోంది. ఆర్ఆర్ఆర్ చుట్టూ రైలు సౌకర్యం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.



# జాపాలలో సిసి రోడ్డు పనులు ప్రారంభం

**మంచాల - ప్రభాతసూర్యుడు :** మంచాల పరిధిలోని జాపాల గ్రామంలో ఎస్సీ కాలనీ (అంబేద్కర్ నగర్) నుండి (హనుమాన్ టెంపుల్) వరకు ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో 5 లక్షల రూపాయలు సిసి రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో ఎంపీటీసీ లట్టు పల్లి చంద్రశేఖర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ వైస్ ఎంపీపీ అవుల మల్లేష్,సీనియర్ నాయకులు చేతల సంజీవ, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సోప్పరి దశరథ ముదిరాజ్, ఐ ఎన్ టి యు సి మండల అధ్యక్షులు ఓరుగంటి లింగమయ్య గౌడ్, జాపాల గ్రామ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఓరుగంటి మహేష్ గౌడ్,నాయకులు బోల్లం జంగయ్య యాదవ్,ఆవుల శంకర్,ఆవుల దశరథ, మంథని పరమేష్ యాదవ్, పొలమోని లింగం , సివిల్ ఇంజనీర్ సాయి, గ్రామపంచాయతీ సెక్రెటరీ శ్రీనివాస్ గౌడ్ , కాలనీవాసులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# గద్దెనెక్కిన సారలమ్మ..

మొదటిపేజీ తరువాయి..
మార్మోగిపోయింది. అనంతరం ఆలయం నుంచి రాత్రి 11 గంటలకు మొంటె (వెదురు బుట్ట)లో అమ్మవారి ప్రతిరూపమైన పసుపు, కుంకుమలు తీసుకుని మేడారానికి పూజారులు బయలుదేరారు. మార్గమధ్యలో జంపన్న వాగులో ప్రత్యేక పూజలు చేశారు. వంతెన ఉన్నా నీటిలో నుంచే నడుస్తూ వాగును దాటారు. అక్కడి నుంచి మేడారంలోని సమ్మక్క గుడికి చేరుకున్నారు. పగిడిద్దరాజు, గోవిందరాజులు అప్పటికే అక్కడికి చేరుకున్నారు. ఆదివాసీ గిరిజన సాంప్రదాయం ప్రకారం పూజలు నిర్వహించిన తర్వాత పూజారులు ముగ్గురి రూపాలను గద్దెలపైన ప్రతిష్టించారు. పగిడిద్ద రాజు, గోవిందరాజు, సారలమ్మలు రాత్రి 11 గంటలకు గద్దెలపై కొలువుదీరారు.

## సంతానభాగ్యం కోసం 'వరం'పట్టిన భక్తులు ...

సారలమ్మ ప్రధాన పూజారి కాక సారయ్య అమ్మవారి ప్రతిమను మొంటె (వెదురు బుట్ట)లో తీసుకొని కన్నెపల్లి ఆలయం మెట్లు దిగి ముందుకు కదులుతుండగా సంతాన భాగ్యం కోసం ఎదురు చూసే భక్తులు గుడి ముందు కింద పడుకుని పొర్లు దండాలతో వరం పట్టారు. సారలమ్మను తీసుకువస్తున్న పూజారులు వీరిపై దాటి వెళ్లారు. సోలం వెంకటేశ్వర్లు పట్టిన హనుమాన్ జెండా నీడలో కన్నెపల్లి వెన్నెలమ్మగా పేరున్న సారలమ్మ గద్దెలపైకి చేరారు. మంత్రి సీతక్క దగ్గరుండి పర్యవేక్షించారు. ఎస్పీ శభరీష్, గౌస్ ఆలం, ఓఎస్డి డీఎస్పీలు రవీందర్, విష్ణుమూర్తి, రోప్ పార్టీ ఓఎస్డీ సంజీవ్‌రావు, పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బలగాలు మూడంచెల రోప్ పార్టీతో భద్రత కల్పించారు.




# 200 కోట్లు కూడా తెచ్చుకోలేని కిషన్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి..
200 కోట్లు ఇవ్వలేదని, పిచ్చి మాటలు మాట్లాడకు కిషన్ రెడ్డి.. అవసరం అయితే ప్రధాని ని కలుస్తామని, నేషనల్ హైవేలు తెస్తామని, కాంగ్రెస్ అబద్ధాలు చెప్పి రాలేదన్నారు. అంతేకాకుండా..'మోడీ మాట్లాడిన మాటలు ఆడియో చూపెట్టమని అంటావా. 20 కోట్ల ఉద్యోగాలు ఇస్తా అన్నాడు ..ఇచ్చారా. 500 గ్యాస్..1200 చేసింది మీరు. బ్లాక్ మని తెస్తా అన్నాడు.. జనం బ్యాంకుల్లో ఖాత డబ్బులు కొట్టేశాడు మోడీ. రైతులు ధర్నా చేసినా పట్టించుకోలేదు. త్వరలోనే రెండు.. మూడు రోజుల్లో రెండు హామీలు అమలు చేస్తాం. కిషన్ రెడ్డి మూసి గురించి ఎందుకు ఆలోచన చేయడం లేదు. నమామి గంగా కి 4 వేల కోట్లు పెట్టారు. మూసి కి ఎందుకు నిధులు ఇవ్వలేదు మరి. బీఆర్ఎస్ కేసుల నుండి తప్పించుకోవడానికి బీజేపీ తో లోపాయి కారి ఒప్పందం. లోపాయకారి ఒప్పందం లో భాగంగా కేసీఆర్ ఢిల్లీ వెళ్తున్నారు. ఇదే విషయం ఢిల్లీలో ఓ బీజేపీ నాయకుడు చెప్పారు. శత్రువు దగ్గరికి.. వెళ్లి కేటీఆర్‌ని సీఎం గా ఆశీర్వదించండి అన్నారు అంటేనే దోస్తీ కుదిరినట్టు. బీఆర్ఎస్ ఖతం అయ్యే పార్టీ. కేఆర్ఎంబీ అంటే కేటీఆర్.. హరీష్ రావుకి తెలియదు. మొదటి అసెంబ్లీ సమావేశాలలో కేసీఆర్ సీట్ల కేటీఆర్ కూర్చున్నాడు. రెండు సెషన్ లో ఎందుకో కూర్చోలేదు. హరీష్ ని ముందు పెట్టారు. కేఆర్ఎంబీ, జీఆర్ఎంబీకి 200 కోట్లు నిధులు పెట్టారు. మీరు అప్పగించకపోతే.. నిధులు ఎందుకు పెట్టారు. బుద్దున్న గాడిద ఎవడైనా సరే.. ఎస్ఎల్‌బీసీ ని పూర్తి చేసే వాడు. పదేళ్ళలో ఎందుకు పూర్తి చేయలేదు. వెలిగొండ లో జగన్ రెండు టన్నెల్ మూడేళ్ళలో పూర్తి చేశారు.' అని కోమటిరెడ్డి పేర్కొన్నారు.

# ఫస్ట్ నుంచి ఫ్రీ కరెంట్!

మొదటిపేజీ తరువాయి..
కుటుంబాలకు పరిమిత ఉచిత నెలవారీ వినియోగాన్ని (ఎంఈసీ) అందిస్తారు. రాష్ట్రంలో 34 లక్షల కుటుంబాలు ఈ పథకానికి అర్హులు. అయితే ఈ పథకం ద్వారా లబ్ధి పొందాలంటే ప్రతి కుటుంబం పాటించాల్సిన మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసింది. అంతేకాకుండా తెల్ల రేషన్ కార్డులను ఆధార్ నంబర్తో అనుసంధానం చేసిన వారు మాత్రమే ఈ పథకాన్ని ఉపయోగించుకోగలరని తెలుస్తోంది. అయితే ఆధార్ గుర్తింపు పత్రంగా ఉపయోగించడం ప్రభుత్వ పంపిణీ ప్రక్రియలను సులభతరం చేస్తుంది. ఒక వ్యక్తి గుర్తింపును సరైందా లేదా తెలుసుకోవడానికి ఆధార్ లాంటి పత్రాలను అందజేయాలని ఇప్పటికే సూచించింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకం రాష్ట్ర ప్రజల జీవన స్థితిగతులను మెరుగుపరచడమే లక్ష్యంగా ప్రగతికి దిక్సూచిగా నిలుస్తుంది. తెలంగాణలోని ప్రతి ఇంటికీ నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ను అందిస్తోంది. వ్యూహాత్మకంగా తెలంగాణ స్టేట్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్, ఏఎస్ఐ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ వంటి పథకాలు ఉన్నాయి. టీఎస్ ఎస్పీ డీసీఎల్ ను సమగ్ర తెలంగాణ గృహజ్యోతి పథకంలో విలీనం చేశారు. తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందుతుందని ఇటీవల సోషల్ మీడియాలో ప్రకటించారు. అదనంగా, ప్రతి ఇంటికి ఒక మీటర్ అందించే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు. 1,500 యూనిట్ల వరకు వినియోగించే కుటుంబాలకు 1,650 యూనిట్లు, నెలకు 137 యూనిట్లను 12 నెలల పాటు ఉచితంగా అందిస్తామని తెలిపింది..



RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
# ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com



## రిమాండ్‌కు జ్యోతి

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** లంచం తీసుకుంటూ సోమవారం నాడు ఏసీబీ అధికారులకు అడ్డంగా దొరికిపోయి, కళ్ల నిండా నీళ్లతో ట్రైబల్ వెల్‌ఫేర్ ఆఫీసర్ జ్యోతి కనిపించిన సీన్ ఇది. మాసబ్ ట్యాంక్‌లోని తన ఆఫీసులో ఓ కాంట్రాక్టర్ నుంచి జ్యోతి 84 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు ఆమెను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిజామాబాద్‌లోని గాజులరామారంలో జువైనల్ బాయ్స్ హాస్టల్ నిర్మాణం కోసం నిధులు శాంక్షన్ అయ్యాయి. అయితే ఆ బిల్లులపై సంతకం చేసేందుకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జ్యోతి, కాంట్రాక్టర్ నుంచి డబ్బు డిమాండ్ చేశారు. దీంతో అతగాడు ఏసీబీ అధికారులను ఆశ్రయించడం, వాళ్లు వల పన్ని జ్యోతిని అరెస్టు చేయడం చకచకా జరిగిపోయాయి.ఆ తర్వాత మెహదీపట్నం లోని జ్యోతి నివాసంలో సోదాలు చేసిన ఏసీబీ అధికారులకు అవినీతి జ్యోతి అసలు స్వరూపం?65 లక్షల నగదు, 4 కిలోల బంగారం రూపంలో దర్శనమిచ్చింది. దీంతో జ్యోతిపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు కూడా ఏసీబీ నమోదు చేసే అవకాశం కనిపిస్తోంది. మరోవైపు సోదాల సమయంలో ఛాతీలో నొప్పిగా ఉందని జ్యోతి చెప్పడంతో ఆమెను ఉస్మానియా హాస్పిటల్ లో జాయిన్ చేశారు.జ్యోతికి వైద్యులు?ఈసీజీ తీసి, బీపీ, బ్లడ్ టెస్టులు, షుగర్, గుండెకి సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. ఆమెకు 2డీ ఎకో టెస్ట్ కూడా చేశారు. ప్రస్తుతం జ్యోతి ఆరోగ్యం నిలకడగా ఉందని సమాచారం. ఇవాళ జ్యోతిని డిశ్చార్జ్ చేస్తామని ఉస్మానియా వైద్యులు చెబుతున్నారు. డిశ్చార్జి తర్వాత ఆమెను నాంపల్లి లోని ఏసీబీ కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించనున్నారు ఏసీబీ అధికారులు.

## మేడారం వెళ్తున్న బస్సుకు ప్రమాదం.. పలువురికి గాయాలు

**భూపాలపల్లి - ప్రభాతసూర్యుడు :** మంచిర్యాల డిపో నుంచి మేడారం జాతరకు 50 మంది ప్రయాణికులతో వెళుతున్న ఆర్టీసీ బస్సును బొగ్గు లారీ ఢీకొట్టింది... జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మేడిపల్లి ఆటవీ ప్రాంతంలో ఈ ఘటన ఉదయం జరిగింది... ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు... ఆర్టీసీ డ్రైవర్ తో పాటు పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి... క్షతగాత్రులను భూపాలపల్లి ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు...



# అనకొండలను తవ్వుతున్న ఏసీబీ

### వణుకు పుట్టిస్తున్న నయా బాస్

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** తెలంగాణలో అవినీతి అధికారుల భరతం పడుతున్నారు ఏసీబీ అధికారులు. అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న పలువురు అధికారులను ఏసీబీ అధికారులు అరెస్టు చేస్తోంది. చిన్న పనులకు సైతం లక్షల్లో లంచం డిమాండ్ చేస్తూ, ప్రజల కష్టార్జితాన్ని పిలిచి పిప్పి చేస్తున్నారు పలువురు ప్రభుత్వ ఉద్యోగులు. అలాంటి అవినీతి అనకొండలపై ఏసీబీ కొరడా ఝులిపిస్తోంది.ఒక బాలకృష్ణ, ఒక జ్యోతి, ఒక సత్యనారాయణ, ఒక లచ్చు నాయక్.. వీరంతా ప్రభుత్వంలో పని చేస్తున్న ఉన్నతాధికారులు. ప్రజలకు అందించాల్సిన సేవలను నిర్వర్తించడం వీరి కర్తవ్యం. కానీ వీరు తమ కర్తవ్యాన్ని అడ్డం పెట్టుకుని సొంత అక్రమ ఆర్థిక సంపాదనను అంతకింతకు పెంచుకుంటూ పోతున్నారు. ప్రభుత్వ ఉద్యోగిగా ప్రజలకు సేవ చేయాల్సిన అధికారులు ప్రజల కష్టార్జితాన్ని పీల్చి పిప్పి చేసి, చిన్న పనులకు సైతం లక్షల రూపాయల లంచాన్ని డిమాండ్ చేస్తున్నారు. ప్రతి శాఖలోనూ అవినీతి అనకొండలు ఉన్నారు. వీరి భరతం పట్టేందుకు ఏసీబీ అధికారులు సైతం సిద్ధంగా ఉన్నారు. ఇటీవల కాలంలో ప్రజల నుండి లంచం డిమాండ్ చేస్తున్న పలువురు అధికారులను ఏసీబీ అరెస్టు చేసింది.ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జ్యోతిని ఏసీబీ అధికారులు ఫిబ్రవరి 19న అరెస్టు చేశారు. మాసబ్ ట్యాంక్ లో ఉన్న తన కార్యాలయంలో ఒక బాధితుడు నుండి 84 వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా, ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్గా ఆమెను పట్టుకున్నారు. నిజామాబాద్ జిల్లాలోని గాజుల రామారంలో జువైనల్ బాయ్స్ హాస్టల్ నిర్మాణం కోసం నిధులు మంజూరు అయ్యాయి. అయితే ఆ సాంక్షన్ బిల్లులపై సంతకం చేసేందుకు ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జ్యోతి 84 వేల రూపాయలు డిమాండ్ చేసింది. దీంతో బాధితులు గంగన్న ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు.బాధితుడి ఫిర్యాదు మేరకు ట్రైబల్ వెల్ఫేర్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు నిర్వహించింది. సోదాల అనంతరం బాధితుడు దగ్గర నుండి 84 వేల రూపాయలు తీసుకున్నందుకు ఆధారాలు రుజువు కావటంతో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జ్యోతిని ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. అనంతరం జ్యోతి నివాసంలోను ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. మెహదీపట్నంలో ఉన్న జ్యోతి నివాసంలో ఎస్సీబీ అధికారులు భారీగా అక్రమ సంపాదన గుర్తించినట్టు సమాచారం. జ్యోతి ఇంట్లో ఎక్కడపడితే అక్కడ నగదు, బంగారం లభించినట్టు ఏసీబీ అధికారులు తెలిపారు. జ్యోతి ఇంట్లో సోదాల సమయంలో 65 లక్షల రూపాయల నగదుతో పాటు నాలుగు కిలోల బంగారు అభరనాలు దొరికాయి. దీంతో జ్యోతి పై ఆదాయానికి



మించిన ఆస్తుల కేసు నమోదు చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. మరోవైపు సోదాల సమయంలో జ్యోతికి అనారోగ్య సమస్యల తలెత్తడంతో, ఆమెను ఉస్మానియా హాస్పిటల్‌లో జాయిన్ చేశారు. ఆమె పూర్తిగా కోరుకున్న తర్వాత నాంపల్లిలోని ఏసీబీ కోర్టులో జ్యోతిని అధికారులు హాజరు పరిచనున్నారు.ఇక అవినీతి తిమింగలం హెచ్ఎండిఏ మాజీ డైరెక్టర్ శివ బాలకృష్ణ గురించి పుట్టలుగా కథలు బయటపడ్డాయి. ఆయన అక్రమ సంపదలను కొలిచేందుకు 20 రోజులుగా ఏసీబీ దర్యాప్తు చేస్తూనే ఉంది. హెచ్ఎండిఏ మాజీ డైరెక్టర్గా పనిచేయడంతో పాటు రేరా సెక్రటరీగాను శివ బాలకృష్ణ పని చేసిన హయాంలో ఇష్టానుసారంగా అనుమతులు, బిల్డింగ్ లేఔట్ పర్మిషన్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులతో సంబంధాలు, ఇలా ఒకటేమిటి అనేక అంశాల్లో శివ బాలకృష్ణ వేలు పెట్టాడు. అందిన కాడికి పుచ్చుకోవడం దొరికినంత దోచుకోడం శివ బాలకృష్ణ వ్యవహరించినట్టు ఏసీబీ దర్యాప్తులో వెల్లడైంది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో శివ బాలకృష్ణ తో పాటు అతని సోదరుడు శివ నవీన్ కుమార్ ను సైతం ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు.అవినీతి అనకొండలుగా ఉన్న అధికారులు తమ పేరు మీదే కాకుండా తమ కుటుంబ సభ్యుల పేరు మీద బినామీ ఆస్తులను కూడా పెట్టి అక్రమ సంపాదనకు అధిపతులుగా మారుతున్నారు. ఇంట్లో ఒక ప్రభుత్వ ఉద్యోగి ఉంటే చాలు మిగతా వారందరినీ ఎలాగోలా సెటిల్ చేయొచ్చు అనే ఉద్దేశంతో చాలా మంది ఉంటారు. ఈ విషయంలో శివ బాలకృష్ణ మరో అడుగు ముందుకు వేసి తన కుటుంబ సభ్యులందరినీ సెటిల్ చేసేశాడు. భార్య కూతురు కొడుకు తమ్ముడు తమ్ముడు భార్య పేరు మీద భూములు రిజిస్టర్ చేయించాడు. జనగాం, మెదక్, యాదాద్రి భువనగిరి ప్రాంతాల్లో శివ బాలకృష్ణ బినామీలకు కోట్ల రూపాయల ఆస్తులు ఉన్నట్టు ఏసీబీ దర్యాప్తులో వెల్లడైంది. అయితే శివ బాలకృష్ణ వెనుక ఉన్న పెద్దల గురించి ఏసీబీ త్వరలోనే దర్యాప్తు చేయనున్నట్టు సమాచారం.ఇక మరో అవినీతి అనకొండను ఏసీబీ అధికారులు కొద్దిరోజుల క్రితం అరెస్ట్ చేశారు. షామీర్‌పేట్ తాసిల్దార్‌గా పనిచేసిన సత్యనారాయణ ట్రాప్ కేసులో ఏసీబీ అరెస్టు చేసింది. ఒక భూమికి సంబంధించిన పట్టా పాస్ బుక్ ఇచ్చేందుకు షామీర్‌పేట్ తాసిల్దార్ సత్యనారాయణ 30 లక్షల రూపాయలు డిమాండ్ చేశాడు. ఇరిగేషన్ లో ఉన్న ఒక భూమికి క్లియరెన్స్ ఇచ్చి పాస్ బుక్కులు మంజూరు చేసేందుకు 30 లక్షల రూపాయలు డిమాండ్ చేశాడు. అందులో 10 లక్షల రూపాయలను తాసిల్దార్ సత్యనారాయణకు ఇచ్చాడు బాధితుడు. అనంతరం ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో శామీర్‌పేట్ తాసిల్దార్ కార్యాలయంలో సోదాలు నిర్వహించారు. ఈ వ్యవహారంలో షామీర్‌పేట్ తహసిల్దార్ సత్యనారాయణతో పాటు అతని డ్రైవర్‌ను ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు.నల్గొండ జిల్లాకు చెందిన ప్రభుత్వం జనరల్ ఆసుపత్రి సూపరిండెంట్ లచ్చు నాయక్‌ను ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. గవర్నమెంట్ హాస్పిటల్ సూపరిండెంట్ కావటంతో వివిధ సర్జికల్ టెండర్లకు సంబంధించిన అనుమతులు సూపరిడెంట్ చేతిలో ఉంటాయి. అయితే సర్జికల్ ఐటమ్స్‌ను నాన్ టెండర్ విభాగంలో మంజూరు చేసేందుకు బాధితుడు దగ్గర నుండి 3 లక్షల రూపాయల డిమాండ్ చేశాడు సూపరిండెంట్ లచ్చు నాయక్. దీంతో బాధితుడు అధికారులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసిన ఏసీబీ అధికారులు ఆధారాలు సేకరించిన తర్వాత నల్గొండ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్స్ సూపరిండెంట్ లచ్చు నాయక్‌ను అదుపులోకి తీసుకున్నారు.ఇలా అవినీతి అక్రమార్కుల భరతం పడుతున్నారు ఏసీబీ అధికారులు. గత కొన్ని నెలల వరకు కేవలం ట్రాప్ కేసులపై మాత్రమే దృష్టి సారించింది. ఏసీబీ ఐజీగా సీవీ ఆనంద్ బాధ్యతలు చేపట్టిన అనంతరం అధికారులు మరింత దూకుడు పెంచారు. ఆదాయానికి నుంచి ఆస్తులు కూడపెట్టుకున్న అధికారుల కేసులను ఏసీబీ ఫోకస్ చేసింది. రానున్న రోజుల్లో మరి కొంతమంది అధికారులపైన ఏసీబీ కొరడా ఝులిపించనున్నట్లు సమాచారం.



## కృష్ణా, తుంగభద్ర నదులే పాలమూరుకు జీవనధార

**మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**

**హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు :** కృష్ణా, తుంగభద్ర నదులే పాలమూరుకు జీవనాధారం. తెలంగాణ వచ్చిన తర్వాతనే జూరాలను నిండుగా నింపుకున్నాం . జూరాల సామర్థ్యం ఆరున్నర టీఎంసీలు మాత్రమే. జూరాలకు గరిష్టంగా వరద వచ్చేది 40 రోజులు మాత్రమే . జూరాలకు ఇప్పటికే 5 లక్షల ఎకరాలు ఆయకట్టు ఉన్నదని మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. బుధవారం అయన మీడియాతోమాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ,కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఏ .వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ సూచనలతో తెలంగాణ ప్రాజెక్టులలో నీళ్లను స్టోరేజ్ చేసుకుంటూ వచ్చాం. నీటి పారుదల శాఖా మంత్రి నియోజకవర్గంలో పంటలు ఎండిపోతున్నాయని అన్నారు. పాలమూరు జిల్లా అవసరాలు తీరాలంటే శ్రీశైలం రిజర్వాయర్ వాడుకోవాలని కేసీఆర్ నిర్ణయించారు. తెలంగాణ నీటివాటా తేలేవిధంగా పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం తీర్చిదిద్దుకున్నాం. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో అన్ని పనులు పూర్తయ్యాయి. ఏడు నుండి పది శాతం పనులే మిగిలిపోయాయి .. 90 శాతం పనులు పూర్తయ్యాయని వెల్లడించారు. ఉదండాపూర్ నుండి గ్రావిటీతో వచ్చే పనులు ఆపేశారు వాటిని వదిలేసి కొత్త ప్రభుత్వం కొత్త పనులు చేపట్టింది. 2900 కోట్ల కొత్త ప్రాజెక్టులో వచ్చే నీళ్లు లక్ష ఎకరాలు మాత్రమే. ఉద్దండాపూర్ నుండి కాలువలు తవ్వితే గ్రావిటీ నీళ్లతో లక్ష 50 వేల ఎకరాలకు నీళ్లు వస్తాయి. అనవసంమైన భేషజాలతో కొత్త ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారని అన్నారు. కాంగ్రెస్ కాలయాపన మూలంగా పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు వచ్చే విషయంలో మోసం జరుగుతున్నది. కాళేశ్వరం మీద విష ప్రచారాలు చేస్తున్నారు. పాలమూరు రంగారెడ్డి మీదకు అందరినీ ఆహ్వానించండి. పాలమూరు రంగారెడ్డిని పూర్తి చేస్తే కొడంగల్ నారాయణ పేటకు ఎక్కువ ప్రయోజనం చేకూరుతుంది .. జూరాల సామర్థ్యం 6 టీఎంసీలు .. జూరాల మీద భారం మోపుతున్నారు. శ్రీశైలం మీద భారం మోపొద్దని ఆంధ్రా నేతలు చాకచక్యంగా ప్రచారం చేస్తున్నారు. 800 అడుగుల నుండి శ్రీశైలం ద్వారా నీళ్లు తెచ్చుకునేందుకు పాలమూరు రంగారెడ్డి డిజైన్ చేశామని అన్నారు. ఉదండాపూర్ నుండి కరివేన నుండి వెంటనే కాలువలు తవ్వాలి .. అతి తక్కువ ఖర్చులో సాగు నీళ్లు వస్తాయి. కర్ణాటక లోని రాయచూర్ జిల్లాలో చిక్క మంచిలి వద్ద మరో రిజర్వాయర్ నిర్మాణానికి కర్ణాటక ప్రభుత్వం సిద్దమయింది. దానిని తెలంగాణ ప్రభుత్వం అడ్డుకోవాలి .. కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వంతో మాట్లాడి దీని మీద చర్యలు తీసుకోవాలని అన్నారు.

## మూడు వాహనాలు ఢీ..

**ఇద్దరికి స్వల్ప గాయాలు**




**మెదక్ - ప్రభాతసూర్యుడు :** మెదక్ జిల్లా 44వ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుండి కామారెడ్డి వైపు వెళ్తున్న వాహనాలు ఒకదాని వెనుక ఒకటి ఢీకొట్టడంతో మూడు వాహనాలు ధ్వంసం అయ్యాయి. ముందు వెళ్తున్న ఒక వాహనం సడన్ బ్రేక్ వేయడంతో ట్రాక్టర్, ఆటో, ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఒకదాని వెనుక ఒకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మాసాయిపేట గ్రామానికి చెందిన దుంపల అశోక్, సాకలి బిక్షపతి అనే ఇద్దరికీ స్వల్ప గాయాలతో బయటపడ్డారు దీంతో పెను ప్రమాదం తప్పింది. జాతీయ రహదారిపై వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.

# ఉద్రిక్తంగా మారిన ఢిల్లీ

మొదటిపేజీ తరువాయి..
వ్యాపించకుండా అడ్డుకునేందుకు ఉప్పు ప్యాకెట్లను, గోనె సంచులు కూడా రెడీ చేసుకున్నారు రైతులు. కాంక్రీట్ బ్లాక్‌లు, బారికేడ్లు, ఇనుప కంచెలు తొలగించేందుకు.. జేసీబీలను రెడీ చేసుకున్నారు.డెడ్‌లైన్ ముగిసిన తర్వాత ఢిల్లీ వైపు తమ ప్రయాణం కొనసాగిస్తామని రైతు నాయకులు స్పష్టం చేశారు. ఇకపై ఏం జరిగినా కేంద్రమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. కేంద్రం వెంటనే.. ఒక రోజు పార్లమెంటు సమావేశం ఏర్పాటు చేసి కనీస మద్దతు ధరపై చట్టాన్ని ఆమోదించాలంటున్నారు. కనీస మద్దతు ధరకు చట్టబద్ధతతో పాటు.. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల అమలు, గత రైతు ఉద్యమంలో చనిపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు రైతులు. తమని ఎట్టి పరిస్థితుల్లోనూ ఢిల్లీలో అడుగుపెట్టనివ్వకూడదని కేంద్ర ప్రభుత్వ ఉద్దేశంలా కనిపిస్తోందన్నారు రైతులు. రైతులను ఎక్కడికక్కడ నిర్బంధిస్తున్నారని, హర్యానా కశ్మీర్‌ను తలపిస్తోందన్నారు. తాము పంట పండించే రైతులమని, హింస తమకు అవసరం లేదని,.. శాంతినే కోరుకుంటున్నామని చెప్పారు. చర్చల ద్వారా పరిష్కారం కావాలనుకుంటే ఢిల్లీవైపు తమను అనుమతించాలని కోరుతున్నారు. కేంద్రం తమ డిమాండ్లపై ఒకడుగు ముందుకేస్తే.. రెండు అడుగులు ముందుకు వేసేందుకు తామూ సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేస్తున్నారు రైతు నాయకులు..కాగా.. రైతుల ఛలో ఢిల్లీ కారణంగా సరిహద్దుల్లో టెన్షన్ వాతావరణం కొనసాగుతోంది. రైతులు దూసుకొచ్చే అవకాశం ఉందని.. ఢిల్లీ సరిహద్దుల్లో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. కాంక్రీట్ బ్లాక్‌లు, బారికేడ్లు, ఇనుప కంచెలు,



కంటైనర్ల గోడలతో ఢిల్లీవైపు వచ్చే దారులు మూసివేశారు. ఘాజీపూర్ సరిహద్దు దగ్గర భారీగా బలగాలను మోహరించారు. సింఘు, టిక్రి సరిహద్దులను క్లోజ్ చేశారు. సరిహద్దులో రోడ్లపై పెద్ద సంఖ్యలో పోలీసుల్ని మోహరించారు. వందలాదిగా సిమెంట్ దిమ్మల్ని అడ్డంగా పెట్టేశారు. అటు, రోడ్ల దిగువ నుంచి టాక్టర్లు రాకుండా జేసీబీలతో కందకాలు తవ్వించారు. బోర్డర్‌లో భారీగా అంబులెన్స్‌లు కూడా ఏర్పాటు చేశారు.

# కొడంగల్‌లో సీఎం రేవంత్ పర్యటన

మొదటిపేజీ తరువాయి..
రూ.27.886 కోట్లతో వికారాబాద్ జిల్లాలో బిటి రోడ్డు సదుపాయం లేని మారుమూల గిరిజన ప్రాంతాలకు రోడ్లు, రూ.5 కోట్లతో గిరిజన సంక్షేమ హాస్టల్ భవనానికి భూమి పూజ, రూ.25 కోట్లతో మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ శాశ్వత భవనం, రూ.40 కోట్లతో సి.సి రోడ్ల నిర్మాణం, రూ.7.13 కోట్లతో దౌల్తాబాద్ జూనియర్ కాలేజి, రూ.7.13 కోట్లతో బొమ్రాస్పేట్ జూనియర్ కాలేజి, రూ.25 కోట్లతో నీటూర్ గ్రామం, దౌల్తాబాద్ మండలం మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ రెసిడెన్షియల్ స్కూల్/కాలేజి, రూ.360 కోట్లతో చంద్రకల్ గ్రామం,దౌల్తాబాద్ మండలంలో నూతన వెటర్నరీ కాలేజి నిర్మాణం, రూ.30 కోట్లతో కోస్గి మండల కేంద్రంలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల, రూ.11 కోట్లతో కోస్గి మండల కేంద్రంలో మహిళా డిగ్రీ కళాశాల, రూ.20 కోట్లతో మద్దూర్ మండల కేంద్రంలో బాలికల సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్/జూనియర్ కాలేజి, రూ.25 కోట్లతో కొడంగల్ మండల కేంద్రంలో బాలుర సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్/జూనియర్ కాలేజి, రూ.224.50 కోట్లతో మెడికల్ కాలేజీ,నర్సింగ్ కాలేజి, ఫిజియోథెరపీ కాలేజి,220 పడకల హాస్పిటల్, రూ.213.2070 కోట్లతో కొడంగల్ నియోజకవర్గంలో హెచ్ఎల్బిఎస్, ఖీ/ఈబ అప్రోచ్ రోడ్ పనులు, రూ.3.99 కోట్లతో దుద్యాల్ మండలంలోని హస్నాబాద్ గ్రామ నూతన 33/11 కెవి సబ్ స్టేషనలకు అయన శంకుస్థాపనచేసారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# రేవంత్‌పై కవిత విమర్శలు



**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** మరోసారి రేవంత్ రెడ్డి సర్కార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శనాస్త్రాలు సంధించారు. అణగారిన వర్గాల ఆడబిడ్డలకు రేవంత్ రెడ్డి సర్కారు తీరని అన్యాయం చేస్తోందని, ఇటీవల జారీ చేసిన గ్రూప్ – 1 నోటిఫికేషన్ లో రోస్టర్ పాయింట్లు లేని హారిజంటల్ పద్ధతిలో రిజర్వేషన్లు అమలు చేస్తున్నట్లు ఉందన్నారు ఎమ్మెల్సీ కవిత. దీని వల్ల బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలు ఉద్యోగావకాశాలు కోల్పోయే ప్రమాదం ఉందని ఆమె మండిపడ్డారు. రోస్టర్ పాయింట్లు లేకుండా అసలు మహిళలకు 33.3 శాతం రిజర్వేషన్ల కల్పించగలరా ? 546 గ్రూప్ –1 పోస్టుల్లో మహిళలకు ఎన్ని పోస్టులు కేటాయించారు ? అని ఆమె ప్రశ్నించారు. రోస్టర్ పాయింట్లను రద్దు చేస్తూ జారీ చేసిన జీవో నెంబర్ 3ను వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నానని ఆమె తెలిపారు. పాత పద్ధతిలోనే రిజర్వేషన్లు అమలు చేసి మహిళల ప్రయోజనాలను, హక్కులను ప్రభుత్వం కాపాడాలని ఆమె ట్విట్టర్ (ఎక్స్)లో పోస్ట్ చేశారు.

# సంపాదకీయమ్..

## రైతుల ఆందోళనా? రాజకీయ ఆందోళనా?

మళ్లీ మొదలైంది.. ఢిల్లీకి రైతుల ట్రాక్టర్ యాత్ర కొనసాగింది. వాళ్లు రైతులా? వాళ్ల ముసుగులో అరాచకవాదులా? అన్నది తెలియడం లేదు. అసలు వీరి డిమాండ్ ఏంటి? పంజాబ్ రైతులు చేస్తున్న డిమాండ్ ఏంటి?కనీస మద్దతు ధర గ్యారెంటీ చట్టం కావాలన్నది ప్రధాన డిమాండ్. ఇక రుణమాఫీ, 60 ఏళ్లు దాటిన రైతులకు పెన్షన్, డబ్ల్యూ.టీవో నుంచి ఉపసంహరణ, ఉపాధి పథకం కింద పనిదినాలు రెట్టింపు, గత ఆందోళనలో పెట్టిన క్రిమినల్ కేసులన్నీ రద్దు.. కరెంటు చట్టం పూర్తిగా వెనక్కి తీసుకోవాలన్నది రైతుల డిమాండ్.పంజాబ్, హరియాణా, ఉత్తరప్రదేశ్ సహా అనేక రాష్ట్రాల రైతు సంఘాల నాయకత్వంలో 'ఢిల్లీ చలో' రైతు ఉద్యమం మొదలైంది.2020–21 రైతు ఉద్యమాన్ని దృష్టిలో ఉంచుకుని చాలా మంది దీనిని 'కిసాన్ ఆందోళన్ 2.0' (రైతు ఆందోళన 2.0)గా పిలుస్తున్నారు.అయితే, పోయిన సారి ఉద్యమంతో పోలిస్తే ఈ ఉద్యమం చాలా భిన్నమైంది.మరింత విపులంగా చెప్పాలంటే, ప్రస్తుత రైతు ఆందోళనకు నాయకత్వం వహిస్తున్న నాయకులు, ఉద్యమంపై ప్రభుత్వ వైఖరి, రైతుల డిమాండ్లలో కూడా పాత ఉద్యమంతో పోలిస్తే చాలా వ్యత్యాసాలున్నాయి.కానీ, ఈ ఉద్యమాన్ని 2020–21 రైతు ఉద్యమానికి కొనసాగింపుగా పిలుస్తున్నారు. ఈసారి రైతులు గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఉద్యమిస్తున్నారని రాజకీయ వ్యవహారాల నిపుణులు, ప్రొఫెసర్ మహ్మద్ ఖలీద్ అన్నారు."గతంలో జరిగిన ఉద్యమం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈసారి ఎన్నికలు కూడా దగ్గరపడ్డాయి. కాబట్టి దీనిని త్వరగా పరిష్కరించకపోతే హరియాణా ప్రభుత్వంతో పాటు కేంద్ర ప్రభుత్వం కూడా నష్టపోవచ్చు" అన్నారాయన."ఈసారి రైతులు కూడా దృఢంగా ఉన్నారని అనుకుంటున్నా. ప్రభుత్వం కఠినంగా వ్యవహరించే అవకాశం ఉంది, అది ప్రభుత్వానికి నష్టం కలిగించవచ్చు" అన్నారు."2020లో రైతులు ఢిల్లీ వైపు కదం తొక్కినప్పుడు అది కేవలం మూడు రోజుల కార్యక్రమం. కానీ అది ఆ తర్వాత ఏడాది వరకూ కొనసాగింది'ఈసారి రైతు సంఘాలు నిరవధిక ధర్నాను ప్రకటించాయని ఆయన అన్నారు.ఫార్మర్స్ ప్రొడ్యూస్ ట్రేడ్ అండ్ కామర్స్ యాక్ట్ –2020 (వ్యవసాయ ఉత్పత్తుల వాణిజ్య చట్టం), ఫార్మర్స్ అగ్రిమెంట్ ఆన్ ప్రైస్ ఎస్యూరెన్స్ అండ్ అగ్రికల్చరల్ సర్వీసెస్ యాక్ట్ 2020 (ధరల హామీ, వ్యవసాయ సేవలపై రైతు ఒప్పంద చట్టం)" "ఎసెన్షియల్ కమోడిటీస్ ఎమెండ్‌మెంట్ యాక్ట్ 2020 (నిత్యవసర వస్తువుల సవరణ చట్టం)" ఉపసంహరణ.స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు పంటలకు చట్టపరమైన కనీస మద్దతు ధర కల్పించాలి.2013 భూసేకరణ చట్టం జాతీయ స్థాయి అమలు, భూ సేకరణలో రైతు లిఖితపూర్వక సమ్మతితో పాటు కలెక్టర్ నిర్ణయించిన ధరకు నాలుగు రెట్లు చెల్లించాలి.ఉపాధి హామీ చట్టాన్ని వ్యవసాయంతో అనుసంధానం చేయడం, రోజుకు రూ.700 చొప్పున ఏడాదికి 200 రోజుల ఉపాధి హామీ కల్పించాలి.రైతులు, రైతు కూలీలకు పూర్తి రుణమాఫీ చేయాలి.లఖింపూర్ ఖేరీ ఘటన బాధ్యులకు శిక్ష పడేలా చూడాలి.2020–21 ఢిల్లీ కిసాన్ ఆందోళనలో ప్రాణాలు కోల్పోయిన రైతు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగమివ్వాలి.రైతులు, కార్మికులకు వృద్ధాప్య పింఛన్ పథకం అమలు చేయాలి.నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల తయారీ కంపెనీలు, వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు ఉండేలా చూడాలి.పసుపు, మిరప, ఇతర సుగంధ ద్రవ్యాల సాగు ప్రోత్సాహానికి కమిషన్లు ఏర్పాటు చేయాలి.ఆందోళనలు మొదలవడానికి ముందు రైతులతో ప్రభుత్వం ఇప్పటికే రెండుసార్లు మాట్లాడిందని సూర్జిత్ సింగ్ ఫూల్ తెలిపారు. అయితే, డిమాండ్ల పరిష్కారంపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఆందోళన కొనసాగుతోంది.యునైటెడ్ కిసాన్ మోర్చ (నాన్ పొలిటికల్), యునైటెడ్ కిసాన్ మోర్చా నుంచి 2022లో విడిపో?యింది. 2020–21 ఉద్యమం భారతీయ కిసాన్ యూనియన్, యునైటెడ్ కిసాన్ మోర్చా నేతృత్వంలో జరిగింది.యునైటెడ్ ఫార్మర్స్ ఫ్రంట్ కింద దేశవ్యాప్తంగా 500లకు పైగా రైతు సంఘాలు ఇందులో పాల్గొన్నాయి.ఇందులో పంజాబ్‌కి చెందిన భారతీ కిసాన్ యూనియన్–ఉగ్రహాన్ సహా 37 సంఘాలు ఉన్న యునైటెడ్ కిసాన్ మోర్చా లేదుప్రస్తుత ఢిల్లీ చలో ఉద్యమానికి యునైటెడ్ కిసాన్ మోర్చా (నాన్ పొలిటికల్), కిసాన్ మజ్దూర్ మోర్చా నేతృత్వం వహిస్తున్నాయి.యునైటెడ్ కిసాన్ మోర్చా (నాన్ పొలిటికల్) 2022లో యునైటెడ్ కిసాన్ మోర్చా నుంచి విడిపోయిన ఒక వర్గం.ప్రస్తుత ఢిల్లీ చలో ఉద్యమంలో 200లకు పైగా సంస్థలు పాల్గొంటున్నట్టు ప్రచారం జరుగుతోంది.గతంలో రైతు ఉద్యమానికి నాయకత్వం వహించిన ముఖ్యులు ఈసారి కనిపించడం లేదు.

# పటాన్ చెరువులో మారుతున్న రాజకీయాలు



15
హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :
పటాన్‌చెరు రాజకీయాలు ఎప్పుడూ వార్తల్లోనే ఉంటాయి. తాజాగా ఇప్పుడు ఇక్కడ ఉన్న కాంగ్రెస్ పార్టీ విషయం హాట్ టాపిక్‌గా నిలిచిందట. పోయిన ఎన్నికల్లో కూడా ఇక్కడ హస్తం పార్టీ అతి తక్కువ మెజార్టీతోనే ఓటమి పాలయిందట. రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ఇప్పుడు పటాన్‌చెరు నియోజకవర్గంలోనూ నూతన ఉత్సాహం వచ్చింది. అయితే ఇటీవలే ఒక నేత కొత్తగా కాంగ్రెస్ పార్టీలోకి వచ్చి చేరడంతో ఇక్కడ లోకల్, సీనియర్ లీడర్లు కొంత టెన్షన్‌కు గురి అవుతున్నారట. ఆ నేత పార్టీలోకి రావడం వల్ల ఏమైనా ఇబ్బందులు తలెత్తుతాయా అనే అనుమానాలు బాగా పెరిగిపోతున్నాయట.పటాన్‌చెరు కాంగ్రెస్‌లోకి నీలం మధు తిరిగి రావడం.. ఇప్పుడు ఆ పార్టీ సీనియర్ నేతలను తెగ టెన్షన్ పెడుతోంది. దీనికి కారణాలు చాలానే ఉన్నాయట. నియోజకవర్గ ఇంచార్జిగా ఉన్న కాట శ్రీనివాస్ గౌడ్‌కి, నీలం మధుకి పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి ఉందట. మొన్న జరిగిన ఎన్నికల్లో కూడా మొదట పటాన్‌చెరు కాంగ్రెస్ అభ్యర్థిగా నీలం మధు పేరును ప్రకటించారు. కానీ కాట శ్రీనివాస్ గౌడ్ వెనక్కి తగ్గకపోవటంతో ఎమ్మెల్యే టికెట్‌ను కాట శ్రీనివాస్‌కి ఇచ్చింది కాంగ్రెస్ అధిష్టానం. అప్పటి నుంచి వీరిద్దరి మధ్య మనస్పర్ధలు పెరిగిపోయాయట. ఎమ్మెల్యే టికెట్ రాకపోవడంతో వెంటనే నీలం మధు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి, బీఎస్పీ పార్టీలో చేరి ఎమ్మెల్యేగా పోటీ చేశాడు. ఈ క్రమంలోనే ఎమ్మెల్యేలుగా నామినేషన్ వేయడానికి వచ్చిన నేపథ్యంలో ఇరు వర్గాల మధ్య పెద్ద గొడవ కూడా జరిగిందట. నీలం మధు బీఎస్పీ పార్టీ నుంచి పోటీ చేసి ఓటమిపాలవ్వగానే.. నీలం మధు బీఎస్పీ పార్టీకి రాజీనామా చేసి మళ్లీ తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఎలా ఉంటుందోననే అనుమానం వ్యక్తం చేస్తున్నారట పటాన్‌చెరు కాంగ్రెస్ నేతలు.ఒక దశలో నీలం మధును పార్టీలోకి తీసుకోవద్దని కాట అనుచరులు బాగా ప్రయత్నాలు చేసారట. నీలం మధు ఏ పార్టీలో ఉన్నా కూడా.. వర్గపోరు తీవ్రంగా ఉంటుంది అని వీళ్ల అభిప్రాయం.

నీలం మధు బీఆర్ఎస్ పార్టీలో ఉన్నప్పుడు కూడా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి వ్యతిరేకంగా పనిచేశారని.. పటాన్‌చెరు బీఆర్ఎస్‌లో నీలం మధు చేరకముందు అసలు ఆ పార్టీలో వర్గపోరు అనేది లేదు, నీలం మధు చేరిన తర్వాత బాగా వర్గ పోరు పెరిగిందని.. ఇప్పుడు అదే వర్గపోరు కాంగ్రెస్ పార్టీలో మొదలు అవుతుందని పటాన్‌చెరు కాంగ్రెస్ నేతలు చాలామంది గుసగుసలాడుతున్నారు.మరోవైపు ఎమ్మెల్యే టికెట్ రాకపోతే కాంగ్రెస్ పార్టీని, సోనియాగాంధీని, దామోదర రాజనర్సింహని ఇష్టం వచ్చినట్లు తిట్టిన నీలం మధును మళ్ళీ కాంగ్రెస్ పార్టీలోకి ఎందుకు తీసుకున్నారో ఎవరికి అర్థం కావడం లేదట. బయట పార్టీలో నుండి తమ పార్టీలోకి ఎవరైనా వస్తే సంతోషంతో ఆహ్వానిస్తారు. ఇక్కడ మాత్రం ఆ పరిస్థితి లేదట. పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఇప్పుడు ఇప్పుడే కొంత మెరుగు పడుతున్న నేపథ్యంలో మళ్ళీ ఈ కొత్త సమస్య అవసరమా అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారట కాంగ్రెస్ శ్రేణులు. మరోవైపు ఎన్ని ఇబ్బందులు వచ్చినా కూడా.. తమ నేత కాట శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీని వీడలేదని, పార్టీ లైన్ దాటలేదని, మా నేతను కానీ మమ్మల్ని కానీ డిస్టర్బ్ చేస్తే సహించేది లేదని కాటం అనుచరులు.. సీనియర్ నేతల వద్ద తమ మనసులోని మాటను బయటపెట్టారట. దీనికి సీనియర్లు కూడా స్పందించి మీకు మీ నేతకు మేము ఉన్నాం అని, భరోసా ఇచ్చారట. అయిన మొన్నటి వరకు ఉప్పు, నిప్పులా ఉన్న కాట శ్రీనివాస్ గౌడ్, నీలం మధు పరిస్థితి ఒకే ఒరలో రెండు కత్తులు అన్న చందంగా మారిందని.. ఇప్పుడు వీళ్ళు ఎలా ఉంటారు. ఇద్దరు నేతల వల్ల పార్టీలో వర్గ పోరు ఏమైనా మొదలవుతుందా అనేది పెద్ద ప్రశ్నగా మారింది.

# జూన్ 6న లోకాయుక్తలో 'బుగ్గారం పంచాయతీ'

### తుది విచారణ కొరకు నోటీసులు జారీ చేసిన "లోకాయుక్త రిజిస్ట్రార్"




**జగిత్యాల - ప్రభాతసూర్యుడు :** జగిత్యాల జిల్లా ఉన్నతాధికారుల మీద చేసిన ఫిర్యాదు మేరకు లోకాయుక్త లో జూన్ 6న విచారణ జరుగనున్నట్లు జారీ చేసిన నోటీసులు బుధవారం ఫిర్యాదు దారునికి అందాయి.బుగ్గారం గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగం పై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని, పలు ఆరోపణలతో అదే గ్రామానికి చెందిన చుక్క గంగారెడ్డి గతంలో లోకాయుక్త కు ఫిర్యాదు చేశారు. ఇప్పటికే పలు సార్లు విచారణ జరిపిన లోకాయుక్త జూన్ 6న తుది విచారణ జరుపనున్నామని నోటీసులు జారీ చేసింది. ప్రత్యక్షంగా విచారణకు హాజరు కావాలని పిర్యాదు దారుడు చుక్క గంగారెడ్డి కి రిజిష్టర్ పోస్ట్ ద్వారా లోకాయుక్త రిజిస్ట్రార్ పంపిన నోటీసు బుధవారం అందింది. ఈ తుది విచారణతో న్యాయం జరగనున్నట్లు చుక్క గంగారెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇప్పటికే బుగ్గారం గ్రామ సర్పంచ్ మూల సుమలత – శ్రీనివాస్ గౌడ్, గత పంచాయతీ కార్యదర్శి మహబూబ్ పాషా లను సస్పెండ్ చేస్తూ జగిత్యాల జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా గత నెలలో రెండు వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారు. నిధుల దుర్వినియోగం పై నేటికీ ఇంకా కూడా అనేక పిర్యాదులు విజిలెన్స్, ఎన్ ఫోర్స్ మెంట్ రాష్ట్ర కార్యాలయంలో, జగిత్యాల జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి, మిషన్ భగీరథ కార్యాలయాలతో పాటు తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్ లో కూడా విచారణ పేరుతో అనేక పిర్యాదులు పెండింగ్ లో ఉన్నాయి. ఆర్ డబ్ల్యుఎస్, జిల్లా పంచాయతీ, డివిజనల్ పంచాయతీ, మండల పంచాయతీ అధికారుల మీద, ప్రస్తుత పంచాయతీ కార్యదర్శి మీద, పాలక వర్గం మీద కూడా అనేక పిర్యాదులు పెండింగ్ లో ఉన్నాయని చుక్క గంగారెడ్డి తో పాటు పలువురు గ్రామస్తులు వివరించారు. జి.పి.లో భారీగా నిధుల దుర్వినియోగంతో పాటు అవినీతి – అక్రమాలు కూడా చాలా జరిగినట్లు గ్రామస్తులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.జిల్లా కలెక్టర్ కార్యాలయ అధికారులు, జిల్లా పంచాయతీ ఉన్నతాధికారులు నేటికీ కూడా నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డ వారికి, దోపిడీ దారులకు, అవినీతి పరులకు, దొంగ రికార్డులు సృష్టించిన వారికి, అక్రమాలు చేసిన వారికే వత్తాసు పలుకుతూ చట్టాలను ఉల్లంగిస్తున్నారని బుగ్గారం వాసులు ఆరోపిస్తున్నారు. అత్యంత విలువైన ఉన్నతాధికారుల విధులను, వారికున్న అధికారాన్ని కూడా దుర్వినియోగం చేస్తున్నారని గ్రామ ప్రజలు తీవ్రంగా మండి పడుతున్నారు. జిల్లాలోని అనేక గ్రామాల నుండి వచ్చిన పిర్యాదులపై ఆయా పైరవీలను బట్టి ఉన్నతాధికారులు విభిన్న రకాలుగా చర్యలు తీసుకోవడం, కొన్ని పిర్యాధులపై ఏ మాత్రం స్పందించక పోవడం జరుగుతుందని అనేక గ్రామాల గ్రామాల పిర్యాదు దారులు అధికారులపై వాపోతున్నారు.అత్యున్నత న్యాయస్థానం అయిన హై కోర్ట్ ఉత్తర్వులను కూడా కులానికి, వర్గానికి ఒక రకంగా. రాజకీయాలకు ఒక రకంగా అమలు చేస్తున్నారని అనేక మంది బాధితులు, పిర్యాదు దారులు జగిత్యాల జిల్లా ఉన్నతాధికారులపై మండి పడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు అవినీతి మత్తుతో పాటు, నిర్లక్ష్యం వీడి, వారికున్న బాధ్యతల ప్రకారం సరైన విచారణ జరిపి తప్పు చేసిన వారిపై, ఆ తప్పులకు బాధ్యులైన ప్రతి ఒక్కరిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని బుగ్గారం తో పాటు జిల్లాలోని వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

# అభివృద్ధికి కేరాఫ్ బీజేపీ

**ఆదిలాబాద్, ప్రభాతసూర్యుడు :** తెలంగాణలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం కన్నా కేంద్ర ప్రభుత్వమే ఎక్కువగా అభివృద్ధికి నిధులు కేటాయించిందని, అయినా ఇంకా రజాకార్ల పాలన కొనసాగుతూనే ఉందని అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ అభివృద్ధి పరిచిన జాతీయ రహదారులపైనే ప్రియాంక గాంధీ, రాహుల్ గాంధీ పాదయాత్రలు చేపడుతున్నారని అసోం సీఎం హిమంత బిశ్వశర్మ అన్నారు. బీజేపీ విజయ సంకల్ప బస్సు యాత్రలో భాగంగా మంగళవారం నిర్మల్ జిల్లా బైంసా పట్టణంలోని స్థానిక ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని మాట్లాడారు. .విజయ సంకల్ప యాత్ర 5,500 కిలోమీటర్ల మేర సాగనుందని, మూడోసారి ముచ్చటగా మోదీనే ప్రధానమంత్రిగా చేసి, దేశం అభివృద్ధి పథంలో సాగాలనే ఉద్దేశంతో యాత్ర కొనసాగుతుందని హిమంత బిశ్వశర్మ తెలిపారు. తెలంగాణలో బీజేపీ రోజురోజుకు బలపడుతుందని 2018 సంవత్సరంలో 6.8 శాతం ఓట్లు సంపాదించగా, 2023 లో 14.9 అయిందన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటేనని, వీళ్ల పాలన రజాకార్ల పాలనని, దీన్ని అంతం చేసే రోజులు వస్తున్నాయన్నారు. భారత ప్రజలు కాంగ్రెస్ ని తరిమి మోదీని తీసుకొచ్చారని, కేంద్రంలోని బీజేపీ సర్కార్ రామ మందిరం కలను సాకారం చేసిందన్నారు. ప్రస్తుతం ప్రజలు మోడీని 3వ సారి ప్రధానిగా తీసుకురావాలని పిలుపునిచ్చారు. దేశంలో అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చిన ఘనత మోదీదేనని కొనియాడారు. తెలంగాణలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేయలేకపోతుందని, నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాల భర్తీ ఊసే లేదని అన్నారు. ప్రధాని మోదీ మాత్రం పక్కాగా హామీలను నెరవేర్చ్చి వ్యక్తి అని కొనియాడారు. అసోం రాష్ట్రంలో పెట్రోల్ 98 రూపాయలు కాగా, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెట్రోల్ పై టాక్స్ వేసి 110 రూపాలకు ఇస్తూ ప్రజలపై భారాన్ని వేస్తున్నారని తెలిపారు. కరోనా విపత్కర పరిస్థితులలో ఉచిత వ్యాక్సిన్ ఇచ్చిన ఘనత మోదీదని, ప్రపంచ దేశాలే తన వైపు తిరిగి చూస్తున్నాయని అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ముధోల్ నియోజకవర్గం నుండి బీజేపీ ఎంపీ అభ్యర్థికి అత్యధిక మెజార్టీ అందించాలని, ఆదిలాబాద్ పార్లమెంట్ సీటుని గెలిపించాలని కార్యకర్తలను కోరారు. ఈ బహిరంగ సభలో మణిపూర్ మంత్రి సుసింద్రీ, జాతీయ ఓబీసీ నాయకులు,రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్, ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు, బీజేపీ ఎమ్మెల్యేలు మహేశ్వర్ రెడ్డి, రామారావు పటేల్, పాయల్ శంకర్, నిర్మల్ జిల్లా అధ్యక్షులు అంజుకుమార్ రెడ్డి, పదాధికారులు, పాల్గొన్నారు.

## దాదా సాహెబ్ ఫాల్కే అవార్డ్స్..

ఉత్తమ నటుడిగా షారుఖ్ ఖాన్..
ఉత్తమ నటి: నయనతార

**ముంబై – ప్రభాతసూర్యుడు :** ఇండియన్ సినీ చరిత్రలో ప్రతిష్టాత్మకంగా భావించే 'దాదా సాహెబ్ ఫాల్కే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ (డీపీఐఎఫ్ఎఫ్)- 2024' అవార్డుల కార్యక్రమం మంగళవారం రాత్రి ముంబైలో ఘనంగా జరిగింది. భారత సినీ ప్రముఖులతో పాటు బాలీవుడ్ సినీ ప్రముఖులు ఈ కార్యక్రమంలో సందడి చేశారు. ఇక ఈ అవార్డుల్లో గత ఏడాది విడుదలైన 'జవాన్', 'యానిమల్' చిత్రాలు పోటీ పడ్డాయి. జవాన్‌లో షారుఖ్ నటనకు ఉత్తమ నటుడిగా అవార్డు అందుకోగా.. ఈ సినిమాలో హీరోయిన్‌గా నటించిన నయనతార ఉత్తమ నటి అవార్డు అందుకుంది. ఇక గతేడాది యానిమల్ సినిమాతో కలెక్షన్ల వర్షం కురిపించిన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ఉత్తమ దర్శకుడిగా నిలిచారు.

**2024 విజేతలు వీరే..**

- ఉత్తమ నటుడు: షారుఖ్ ఖాన్ (జవాన్)
- ఉత్తమ నటి: నయనతార (జవాన్)
- ఉత్తమ నటి (క్రిటిక్స్): రాణి ముఖర్జీ (మిసెస్ ఛటర్జీ లబ నార్వే)
- ఉత్తమ దర్శకుడు: సందీప్ రెడ్డి వంగా (యానిమల్)
- ఉత్తమ నటుడు (క్రిటిక్స్)- విక్కీ కౌశల్ (సామ్ బహదూర్)
- ఉత్తమ సంగీత దర్శకుడు: అనిరుధ్ రవిచందర్ (జవాన్)
- ఉత్తమ నేపథ్య గాయకుడు : వరుణ్ జైన్
- ఉత్తమ నేపథ్య గాయని : శిల్పా రావు
- విలన్ పాత్రలో ఉత్తమ నటుడు: బాబీ డియోల్ (యానిమల్)
- టెలివిజన్ సిరీస్‌లో ఉత్తమ నటి: రూపాలీ గంగూలీ (అనుపమ)
- టెలివిజన్ సిరీస్‌లో ఉత్తమ నటుడు: నీల్ భట్ (ఘుమ్ హై కిసికే ప్యార్ మేయిన్)
- టెలివిజన్ సిరీస్ ఆఫ్ ది ఇయర్: ఘుమ్ హై కిసికే ప్యార్ మేయిన్
- ఉత్తమ వెబ్ సిరీస్ : ఫర్జీ
- వెబ్ సిరీస్‌లో ఉత్తమ నటి: కరిష్మా తన్నా (స్కూప్)
- చలనచిత్ర పరిశ్రమకు అత్యుత్తమ సహకారం: మౌషుమి ఛటర్జీ
- సంగీత అత్యుత్తమ సహకారం: యేసుదాస్

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215